


# చంద్రబాబు కడుతున్న ఇంటినీ వదలని లంచావతారి

**- అక్రమాల చిట్టాలో వెలుగు చూస్తున్న సస్పెండ్ అయిన డిప్యూటీ సర్వేయర్ భాగోతాలు**

కుప్పం, జూలై 2 ప్రభాతవార్త : శాంతిపురం మండలంలో డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తూ తాజాగా సస్పెండ్‌కు గురైన సద్దాం హుసేన్ భాగోతాలు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. చివరకు ప్రస్తుత సిఎం, అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు సొంత ఇంటి నిర్మాణానికి సంబంధించి లంచం తీసుకున్న వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఓ రైతు ఫిర్యాదు మేరకు డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుసేన్‌నుజాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సోమవారం సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అతను గతంలో సిఎం చంద్రబాబుకు చెందిన భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేసి సర్వే చేపట్టేందుకు 1.80లక్షల మేర డిమాండ్ చేసి 1.40లక్షల మేర వసూళ్లు చేసుకున్న వైనం వెలుగు చూసింది. ఈ వ్యవహారం ఇటీవలే కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లడంతో ఈ అ ంశంగా విచారణ చేపట్టాలని సిఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును ఆదేశించారు. సర్వే శాఖ ఎడి గౌస్‌బాషా చేపట్టిన శాఖాపరమైన విచారణలో డిప్యూటీ తహశీల్దార్ లంచం తీసుకున్నట్లు రుజువైంది. సిఎం చంద్రబాబునాయుడు 2022లో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ కదిరి ఓబనపల్లి వద్ద సర్వే నెం 7/6లో దాదాపు రెండు ఎకరాల భూమిని సొంత ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టారు. అయితే ఈ భూమిని వ్యవసాయేతర వినియోగంలోకి మార్చేందుకు చంద్రబాబు కార్యదర్శి మనోహర్ దరఖాస్తు చేశారు. కాగా అప్పట్లోనే లంచాలు రుచిమరిగిన లంచావతారి సద్దాం హుసేన్ భూవిక్రయదారులు, కొనుగోలుదారులనుంచి దాదాపు 1.80లక్షల దాకా డిమాండ్ చేశాడని తెలిసింది. అయితే ఎవరైతే నాకేం అనే ధోరణిలో ప్రవర్తించిన డిప్యూటీ సర్వేయర్ చివరకు 1.40లక్షల దాకా నగదు తీసుకుని అనంతరం సర్వే పూర్తి చేశాడని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఇతని లీలలు ఓ బాధిత రైతు ఫిర్యాదులో వెలుగుచూడగా చివరకు ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు ఇంటి నిర్మాణానికీ లంచం తీసుకున్న భాగోతాలు బయటకు వస్తుండడం గమనార్హం.

# రైతు బజారులో కందిపప్పు... కేజీ రూ.165కే

**- ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



రైతు బజారులో కందిపప్పు విక్రయ కేంద్రంను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త: రైతు బజార్లలో నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.165కే వినియోగదారులకు అందించడం జరుతున్నదని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు రైతు బజారులో మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖలు సమన్వ యంతో ఏర్పాటు చేసిన కందిపప్పు విక్రయ కౌంటర్‌ను ప్రారంభించారు. అలాగే నగరంలోని చర్చివీధిలోని వినాయక స్టోర్స్‌లో సైతం కేజీ రూ.165 కందిపప్పు విక్రయ కేంద్రంను జెసి ప్రారంభించారు. ఈ సంధ్బర్భంగా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం కందిపప్పు ఉత్పత్తి, సరఫరా తక్కువగా వుండి డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.175 నుండి రూ.200 వరకు ధర పలుకుతుందన్నారు. అధిక ధర వెచ్చించి కందిపప్పును సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేరనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.165కే ప్రజలకు అందించాలని నిర్ణయించిందన్నారు. చిత్తూరులో పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో రైతు బజారులో ఒక స్టాల్ ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే టమోటా ధర అధికంగా వున్న నేపథ్యంలో మొబైల్ వాహనాల ద్వారా తక్కువ ధరకు విక్రయాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయంను ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవవాలని ఆయన కోరారు. అలాగే చిత్తూరు రైతు బజారులో విక్రయాలు జరుపుకోవడానికి చిరు వ్యాపారులకు ఉచితంగా స్టాల్స్‌ను కేటాయిస్తున్నామన్నారు. చిత్తూరు నగర పరిధిలో ప్లాట్ ఫామ్, రోడ్లపైన కూరగాయల అమ్మకాలు సాగుతున్నాయని, అలాంటి వారికి రైతు బజారులో ఖాళీగా వున్న స్టాల్స్‌ను కేటాయించేలా నగర పాలక సంస్థ కమీషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. రైతు బజారులో గతంలో మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, టమోటాలు విక్రయాలు చేపట్టడం జరిగిందన్నారు. రైతు బజారులో విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన అన్నారు.

**రేషన్ పంపిణీ తనిఖీ:**

చిత్తూరు నగర పరిధిలో మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మొబైల్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. గంగనపల్లిలోని షాప్‌నెం.30 పరిధిలోని మొబైల్ వాహనం రేషన్ పంపిణీ చేస్తున్న ప్రాంతానికి వెళ్ళి జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి వినియోగదారులతో మాట్లాడారు. మొబైల్ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యవసర వస్తువుల నాణ్యత పరిమాణాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. మొబైల్ వాహనం ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యంను తనిఖీ చేసిన జెసి ప్రభుత్వం నిర్ధేశించిన కచ్చితమైన కొలతలతో కార్డుదారులకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాలని ఆదేశించారు. నిత్యవసర వస్తువుల పంపిణీలో ఎలాంటి వ్యత్యాసం వుండరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శంకరన్, మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వరన్, తహసిల్దారు శ్రీనివాసులునాయుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దారి దోపిడీ దొంగల గ్యాంగ్ అరెస్టు

**రిమాండ్‌కు తరలించిన రేణిగుంట అర్బన్ పోలీసులు**





దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు... స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

రేణిగుంట, జూలై 2 ప్రభాతవార్త: దారి దోపిడీలు, ద్విచక్రవాహనాల దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు చేస్తున్న ఏడుగురు సభ్యుల గ్యాంగ్‌ను రేణిగుంట అర్బన్‌పోలీసులు చాకచక్యంగా వల పన్ని పట్టుకుని మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, 8 గ్రాముల బంగారు గొలుసు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వీరు నేరాలకు ఉపయోగించిన మూడు ద్విచక్రవాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరు ఏడుగురులో కొంత మంది పదో తరగతి, మరి కొంత మంది ఇంటర్ వరకు చదువుకుని చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ యువకులు కావడం గమనార్హం అని సీఐ మల్లికార్జున్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ తిరుపతికి చెందిన జస్వంత్(19), సతీష్(19), వి.జస్వంత్ (19), సిద్దే ప్రసన్నకుమార్(34), వేముల చరణ్ అలియాస్ చరణ్ తేజ(19), రియాజ్(19), చిత్తూరు జిల్లా పాకాల మండలం సంకంపల్లికి చెందిన జి.దిలీప్ (19)లు చెడు అలవాట్లకు బానిసలై రాత్రి సమయాల్లో మద్యం, గంజాయి సేవించి ద్విచక్ర వాహనాల్లో సినిమాలకు వెళుతుంటారన్నారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో ఎవరైనా ఒంటరిగా వెళుతూ కనిపిస్తే వారిని బెదిరించి, కొట్టి వారి వద్ద ఉన్న నగదు, బంగారం, సెల్‌ఫోన్లతో పాటు ద్విచక్రవాహనాలను తస్కరించే వారన్నారు. పోలీసులకు వచ్చిన రహస్య సమాచార మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ ఆదేశాల మేరకు అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, తమ సిబ్బం దితో కలసి మండలంలోని తారక రామానగర్ ఓ చర్చి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఏడుగురు యువకులనుఅదుపులోకి తీసుకుని విచారించగా, తీగ లాగితే డొంక కదిలిందన్న చందాన వీరు చేసిన దొంగతనాలు, దోపిడీలు బయటపడినట్లు తెలిపారు. వీరిపై తిరుచా నూరు, అలిపిరి పోలీస్ స్టేషన్‌ల్లో కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో అత్యంత ప్రతిభకనబరచిన ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు సోమశేఖర్, రాజశేఖర్, సూర్యనారాయణ, బారుషా, స్టేషన్ రైటర్ కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరాజు, కానిస్టేబుళ్లు పురుషోత్తం, నరసింహ, రమణయ్య, వెంకటరమణ, మణి, శ్రీనివాసులు, లోకనాథం, గురవయ్య, హోంగార్డు నాయక్‌లను అభినందించారు.

# ప్రజలకు పారదర్శక పాలన అందిస్తా!

**-ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా పనితీరు -తిరుపతి జిల్లానూతన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్

తిరుపతి,జులై 2ప్రభాతవార్త: ప్రభుత్వం ఆశయాలకనుగుణంగా,,, జిల్లా ప్రజలకు పారదర్శక పాలన అందించే దిశగాపనితీరు సాగిస్తానని, ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు చేరేలా చూస్తానని తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పనిచేసే అవకాశం కలగడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న డాక్టర్ వెంకటేశ్వర్ తొలిసారిగా తిరుపతి జిల్లా కలెక్టర్‌గా వస్తున్నారు. మంగళవారం రాష్ట్రంలో జరిగిన 12మంది ఐఏఎస్ అధికారుల బదిలీల్లో సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా విజయవాడలో పనిచేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన త్వరలోనే తిరుపతికి చేరుకుని శుక్రవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. నూతన కలెక్టర్‌గా నియమితులైన ఆయన ఇక్కడ ప్రస్తుతం ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ నుండి బాధ్యతలు స్వీకరించనున్నారు. గిద్దలూరుకు చెందిన డాక్టర్ వెంకటేశ్వర్ గతంలో చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, పాడేరు ఐటిడిఎ పిఓగా, ఇండియన్ రైల్వేశాఖ లో,కింగ్‌జార్జి ఆస్పత్రిలో వైద్యుడుగా కూడా పనిచేశారు.

# ఇఓ సెల్ ఫోన్‌కు కూడా రూ.20లు వసూలు చేసిన సిబ్బంది




ఆలయంలో సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద ధరల పట్టిక

శ్రీకాళహస్తి,జూలై 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సెల్‌ఫోన్ భద్రపరచు కౌంటర్‌లో సిబ్బంది నిలువుదోపిడికి హద్దు లేకుండా పోతుంది. సాక్షాత్తు కార్యనిర్వహణాధికారి వద్దనే సెల్ భద్రపరచుటకు రూ.20లు వసూలు చేసిన సంఘటన అధికారిని అవాక్కు చేసింది. మామూలుగా భక్తుల సెల్‌ఫోన్ భద్రపరుచుటకు ఒక్కోక్ ఫోన్‌కు రు.5 మాత్రమే, అయితే భక్తుల నుండి అందినకాడికి అన్నట్లు వ్యవహరిస్తున్న సిబ్బంది అధిక మొత్తంలోనే వసూలు చేస్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరచుటకు నాలుగుగేట్ల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. కొత్తగా ఫుల్ అడిషనల్ చార్జిగా బాధ్యతలు స్వీకరించిన కార్యనిర్వహణాధికారి ఎస్వియస్ ఎన్ మూర్తి నడచుకుంటూ ఆలయంలో జరుగుతున్న ఆరాచకాల మీద పరిశీలన జరుపుతున్నారు.ఈ నేపధ్యంలో ఆయన సెల్‌ఫోన్ కౌంటర్ల మీద వస్తున్న విమర్శలపై స్పందించారు. తానొక సామాన్యభక్తుని వలె సెల్ ఫోన్ కౌంటర్ వద్దకు వెళ్ళి 'సెల్‌ఫోన్'ను భద్రపరచాలని కోరారు.వెంటనే అక్కడ పని చేస్తున్న ఉద్యోగి రూ.20లు అని చెప్పటంతో రూ.20లు చెల్లించి రశీదు తీసుకున్నారు. ఆయన పక్కా ప్లాన్‌గా సెల్‌ఫోన్ కౌంటర్లో అవకతవకలు, అధిక వసూళ్ళకు సంబంధించి రికార్డులు రాతమూలకంగా సంపాదిం చుకున్నారు. కార్యాలయానికి వచ్చిన తరువాత తమ అటెండర్ ద్వారా రశీదు చూపి సెల్‌ఫోన్‌ను తెప్పించుకున్నారు. మరియు సిబ్బందిపైన, కాంట్రాక్టర్‌పైన ఏమి చర్యలు తీసుకుంటారో శివయ్యకే ఏరుక.

**-దోనర్ వేయిటింగ్ గది మూయించేసిన ఇఓ**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి దూరప్రాంతాల నుంచి వచ్చే దోనర్లు,అతిథులు సెద తీరటానికి ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేసారు. గత పాలకుల హయాంలో ఇది దళారుల అడ్డాగా మారింది. ఇక్కడ చక్కగా ఎసిలు,చక్కటి సోఫాలు, టేబుళ్ళు, కాలక్షేపానికి ఆలయానికి సంబంధించిన ఉత్సవాల అల్బమ్‌లను ఏర్పాటు చేసారు. అంతేకాక ఇక్కడ వచ్చిన వారికి సేవలందించటంతో పాటు ప్రసాదాలు(పులిహోర) అందించే వారు.ఇలా ఎంత కకేటాయించారో ఎంత పంపిణి చేసేవారో అంతుపట్టని పరిస్తితి. ఇక అతిథులకు సేవలందించుటకు టీ కాఫీలు తెచ్చి ఇవ్వటానికి మనుషులు ఏర్పాటు చేసారు.అయితే ఈ వ్యవస్థ గతి తప్పింది.ఇక్కడ కొందరు సంబంధం లేని వ్యక్తులు ఫర్నీచర్‌పై కూర్చొని దర్జాగా వ్యవహారించటంతో వచ్చిన విఐపిలు వారి మహిళలు ఇబ్బందులు పడే వారు.ఇఓ మూర్తి దీనిని గమనించారు.దాంతో స్పందించారు.రెండు సార్లు పరిశీలించిన తరువాత అక్కడ కూర్చొన్న వారిని ఇఓ 'మీరెవరు'అని అడిగినపుడు వారు పలువురు నాయకుల పేర్లు చెప్పటంతో అందరిని బయటకు రప్పించి అటెండర్‌ను పిలిచి తాళాలు తగిలించారు. విఐపిలు,దోనర్లు వచ్చినపుడు కూర్చొటానికి పిఆర్ఓ కార్యాలయంకు బాధ్యత అప్పగించినట్లు సమాచారం. అలాగే ఆలయంయలోని పరిపాలనా భవనంలో ధర్మకర్తల మండలి సభ్యుల కోసం ఏర్పాటు చేసిన గదికి కూడా ప్రస్తుత ఇఓ మూర్తి తాళాలు తగిలించారు. ఇవన్ని సంస్కరణల్లో భాగమని భావిస్తున్నారు.

# ప్రతి పోలీస్ స్టేషన్‌లో కొత్త చట్టాలు అమలు

**- కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్గిగేలా సదస్సులు- విజిబుల్ పోలీసింగ్ పెంచేలా విధులు - ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా నేరస్తులపై ఉక్కుపాదం - జిల్లా నేర సమీక్షా సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ మణికంఠ**



జిల్లా నేర సమీక్షా సమావేశంలో పోలీసులతో సమీక్షిస్తున్న ఎస్పీ

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా జులై 1 నుండి అమలులోకి వచ్చిన కొత్త న్యాయ చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్‌లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు జిల్లాలోని డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జులై నుండి కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి క్షేత్ర స్థాయి నుండి విస్తృతంగా అవగాహన సదస్సులను పోలీసులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ పెంచేలా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు ఉత్తమ పేరు తీసుకు రావాలన్నారు. అలాగే ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా నేరస్తులపై ఉక్కుపాదం మోపి జిల్లాలో ఎక్కడ వీటి అక్రమ రవాణా జాడలు కన్పించకుండా చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి గ్రామంలో పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలని, రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గుముఖం పట్టడానికి మెరుగైన నివారణ చర్యలు చేపట్టాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత పెంచి చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై ప్రత్యేక నిఘా వుంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, సమాజంలో జరిగే నేరాలపై మహిళలు, విద్యార్థినిలకు మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని, ప్రజలు అప్రమత్తంగా వుంటూ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి వుండాలని, అజ్ఞాత వ్యక్తుల నుండి వచ్చే సంక్షిప్త సమాచారాలు, మెయిల్స్‌లోని లింకులు ఓపెన్ చేయకుండా తిరస్కరించాలన్నారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంను పాటిస్తూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి వారి ఫిర్యాదులు స్వీకరించి వారికి జవాబుదారీతనంగా వుండాలన్నారు. పోలీసు శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలని పోలీసు అధికారులను ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎఎస్పీ ఎస్.ఆరీఫుల్లా, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ఎవి సుబ్బారావు, మూడు సబ్‌డివిజన్ల పోలీసు అధికారులు, జిల్లాలోని సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# మా సొంత జిల్లాలకు పంపండి సారూ!

**-ఎన్నికల బదిలీలైన ర్యాంక్ ఎస్ఐల ఆవేదన**

తిరుపతి,జులై 2ప్రభాతవార్త: పోలీసుశాఖలో ర్యాంక్ హోదాలో ఉన్న ఎస్ఐల కుటుంబాల్లో భార్య,పిల్లలు వృద్ధ తల్లిదండ్రులు ఒకచోట,విధులు మరోజిల్లాలో ఉండటంతో బాధ్యతలు నిర్వహించడంలో మనోవేదన చెందుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనలతో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న దాదాపు25 మంది వరకు ర్యాంక్ ఎస్ఐలను అనంతపురం, సత్యసాయి జిల్లాలకు పోలీసు శాఖ బదిలీ చేసింది. ఆ జిల్లాల్లో ఉన్న సుమారు 20మంది ఎస్ఐలను ఈ జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుచేసి బాధ్యతగా బయటి జిల్లాలకు పోస్టింగ్‌లపై వెళ్ళారు. అక్కడ సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. ఎన్నికలు ముగిసి, ప్రభుత్వం ఏర్పాటై 20రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు బదిలీ అయిన ర్యాంకు ఎస్ఐలను ఆయా సొంత జిల్లాలకు బదిలీ చేయకపోవడంతో మనోవేదనకు గురవుతున్నారు. అంతేగాక ఆరోగ్యరీత్యా సమస్యలు, కుటుంబసమస్యలతో సతమవమతున్నారు. కుటుంబం ఒక జిల్లాలో, వయసురీత్యా పదవీ విరమణకు దగ్గరగా ఉన్న సమయంలో విధులు మరో జిల్లాలో నిర్వహించాల్సి వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్రహోంశాఖామంత్రి, డిజిపి ర్యాంకు సీనియార్టీ, పదవీ విరమణకు దగ్గర ఉన్న ఎస్‌లను వారివారి సొంత జిల్లాలకు బదిలీ చేసి ఇష్టంగా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# వ్యాధులకు ప్రధాన కారణం ఒత్తిడి

**-స్విమ్స్ ఫిజియోథెరఫీ కాలేజ్ ఆధ్వర్యంలో వర్క్ షాప్**



తిరుపతి హెల్త్, జూలై 2 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేది నుండి 4వ తేది వరకు జరిగే వర్క్ షాపును స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ డా. కె.మాధవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ ఎరోబిక్స్ ట్రైనర్, బెంగళూరఉ డా. సురజిత్ చక్రవర్తి, డా. విశ్వనాధ్ ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రొఫెసర్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ లైఫ్ స్టైల్ వ్యాధులకు, ప్రధాన కారణం ఒత్తిడి అని, ఎరోబిక్, శ్వాస వ్యాయమాల నుండి ఒత్తిడి కారకాలు ఉపశమనాన్ని పొందుతాయని రెండు ఒకదాని ఒకటి కలిసి ఉంటాయని, ఏరోబిక్స్ శ్వాస వ్యాయామాలు చేయడం ద్వారా అని బూస్టర్లు లాగా పనిచేస్తాయని అందువల్ల ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరముందని దీని ద్వారా సంతోషకరమైన ఆరోగ్యాన్ని పొందుతారని తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపాల్ డా. కె. మాధవి మాట్లాడుతూ ఈ వర్క్ షాప్ నందు నైపుణ్యం కలిగిన ఎరోబిక్ ట్రైనర్ ద్వారా వివిధ పద్ధతులు ఫ్లోర్ ఏరోబిక్స్, స్టెప్ ఏరోబిక్స్, స్విస్ బాల్, థెరబ్యాండ్ ద్వారా వ్యాయమం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను తెలుసుకొనేందుకు నిష్ణాత్నులైన ట్రైనర్స్‌ను ఈ వర్క్ షాప్‌ను ఆహ్వానించడం జరిగిందని, వీరి ద్వారా ఏరోబిక్స్‌లో మెలకువలు నేర్చుకొని పాటించ వల్సిందిగా విద్యార్థిని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్‌వి కుమార్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ డా. కె.మాధవి, ఎరోబిక్స్ ట్రైనర్ డా.సురజిత్ చక్రబత్తిని శాలువతో సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా. శాంతి, ఫ్యాకల్టీ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులకు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి దుస్థితి: ఇది కూడా ఒక ఆసుపత్రా!

**-ఇలాగేనా పేదలకు వైద్యసదుపాయాలు -చిరిగిన దిండ్లు... తుప్పు పట్టిన మంచాలు**



ఆసుపత్రిలోని వార్డులో పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,జూలై 2 ప్రభాతవార్త : ఒక నాడు 1500 మంది అవుట్ పేషెంట్లతో కళ కళ ఆడిన ఏరియా ఆసుపత్రేనా? ఇది అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తల్లి ఆవాక్కయ్యారు. మంగళవారం ఆమె శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసారు. 2014 నుంచి 2019 వరకు బృందమ్మ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అనారోగ్యంతో ఉండగా ఆసుపత్రి, దేవస్థానం,విద్యార్థులకు సంబంధించిన వసతి గృహాలను పర్యవేక్షించే వారు. అప్పటిలో ఆమె ఆసుపత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేసారు. అప్పటి మంత్రి శ్రీనివాసులుతో డయాల్సిస్ కేంద్రాన్ని సాధించారు. అంతేకాక ఆసుపత్రిని అందంగా తీర్చి దిద్దుటకు కావాల్సిన నిధులతో పాటు ఈ ఆసుపత్రిని వంద పడకల నుంచి 300 పడకలకు పెంచాలని ప్రతిపాదించారు.

**నాటి కళ నేడెక్కడ? ఐదేళ్ళు ఏమైంది? మంజూరైన నిధుల ఫలితమింతేనా?**

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఒక నాడు నిరుపేదలను తిరుపతికి వెళ్ళకుండా కాపాడింది. 12 మంది డాక్టర్లు అన్ని విభాగాల అధిపతులు,సర్జన్‌లతో కళ కళ ఎలాంటి వ్యాధినైనా వైద్యం అందించగల్గినాము. గత ఐదేళ్ళలో ప్రభుత్వం రూ.12కోట్లు వెచ్చించింది. మరి ఆ ఫలితమెక్కడ అంటూ బొజ్జల బృందమ్మ ప్రశ్నించారు.మరి స్థానిక శాసనసభ్యుడు ఏం చేసాడు? పేదల దవాఖానా అస్తవ్యస్తంగా మారితే ఎందుకు పట్టించుకోలేదు. నాడు వేలల్లో ఉన్న రోగులు నేడు వందల్లో కూడా లేదే? నాడు కాన్పులు ఎన్ని జరిగేవి? ప్రస్తుతం ఎందుకు జరగటం లేదని బృందమ్మ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆమె ఆసుపత్రిని చక్కబెట్టే పనిని తన కుమారదు సుధీర్‌రెడ్డి తనకు అప్పగించాడని వివరించారు. ఈ ఆసుపత్రికి పట్టిన నిర్లక్ష్యం జబ్బుకు శస్త్ర చికిత్స చేస్తానన్నారు. మూడు నాలుగు నెలల్లో ఈ ఆసుపత్రిని మళ్ళీ ఎపేదల ఆసుపత్రిగా ఒక్క కేసు కూడా తిరుపతికి వెళ్ళకుండా ఉండేటట్లు తీర్చి దిద్దుతామని బృందమ్మ వివరించారు. ఎటు చూసిని నిర్లక్ష్యమే! తుప్పు పడుతున్న కుర్చీలు.దిండ్లకు కవర్లు లేదు.మంచాలకు కాళ్ల లేదు.ప్రతి కేసూ తిరుపతికి రెఫర్ అవుతుంది.అలా చేయకుండా చర్యలు తీసుకుంటాము. ప్రజా సేవకు ఇష్టపడని సిబ్బంది అయితే వారి దారి వారు చూసుకోవటం మంచిదని సుతిమెత్తగా చురకలు తగిలించారు. డయాల్సిస్ కేంద్రం తిరిగి ప్రారంభిస్తాం. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలోని ప్రతి యూనిట్‌ను బృందమ్మ వ్యక్తిగతంగా పరిశీలించారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన కాన్పులు గది వార్డును పరిశీలించారు. అలాగే అతిసారం వార్డు, జనరల్ వార్డులతో పాటు లేబోరేటరీ, ఎక్స్‌రే గదులను పరిశీలించారు. ఏ వార్డులో చూసినా తుప్పు పట్టిన కుర్చీలు, చినిగిన బెడ్‌లు, కవర్లు లేని దిండ్లు ఆమెకు దర్శనమిచ్చాయి. దాంతో ఆమె చలించారు. ఆసుపత్రిని బాగు చేయటానికి మీడియాతోపాటు ప్రజలు సహాకరించాలన్నారు. ముఖ్యంగా పేదలకు సేవలందించాలనే లక్ష్యం సిబ్బందిలో ఉండాలన్నారు.నిర్లక్ష్యం చేసే వారిని సహించేది లేదని బృందమ్మ స్పష్టం చేసారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీతో చర్చించారు.

## వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య!

**బంగారుపాళ్యం, జూలై 2 ప్రభాతవార్త:** అనునిత్యం అత్తింటి వేధింపులు భరిస్తూ తీవ్ర మనస్థాపంకు గురైన ఓ వివాహిత జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకొన్న సంఘటన వేపనపల్లిలో చోటు చేసుకుంది. మండలంలోని వేపనపల్లి గ్రామంకు చెందిన మణికంఠ భార్య టి.హిమబిందు(26) ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వేధింపులు భరించలేక జీవితంపై విరక్తి చెందిన హిమబిందు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ సమాచారంను స్థానిక తహసిల్దారు సుభద్రమ్మకు పోలీసులు తెలిపారు. తహసిల్దారు సంఘటనా స్థలం చేరుకుని మృతికి గల కారణాలను బాధితుల కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి తండ్రి కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

## పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి : ఎంపిపి



**పాలసముద్రం, జూలై 2 ప్రభాతవార్త:** పార్టీలతో నిమిత్తం లేకుండా మండల అభివృద్ధి కోసం ఎప్పుడైనా, ఎవరికైనా సహకారం అందిస్తామని ఎంపిపి శ్యామల శివప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళ వారం ఎంపిపి శ్యామల శివప్రకాష్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు రావడంతో మండల స్థాయిలో పలు అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని, పార్టీలతో నిమిత్తం లేకుండా అభివృద్ధికి ప్రస్తుతం వున్న అధికార పార్టీ నాయకులు సహకారం అందించాలని ఆమె కోరారు. తనకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యానిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు సన్నిహితుడని, మండల అభివృద్ధి కోసం ఎక్కడికి వచ్చి కలవాలని చెప్పినా అక్కడికి వెళ్ళి కలవడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

## ఉన్నతస్థాయికి చేరాలంటే చదువే మార్గం : ఎమ్మెల్సీ



**కుప్పం, జూలై 2 ప్రభాతవార్త :** పేద విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరాల ంటే చదువే ప్రధాన మార్గమని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఎఫ్‌సి ఒకేషనల్ కాలేజ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులు అయిన లలితరాణి, తబసుం, సుస్మిత, పూజ, సుస్మితల తో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలసాకారానికి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, సీనియర్ అధ్యాపకులు జగదీష్‌బాబు, ఫకృద్దీన్, వాసు, కార్తీక్ పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రవేశాలకు రెండో దఫా దరఖాస్తులు

**శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త :** స్థానిక ప్రభుత్వ ఐటిఐ కాలేజ్‌లో ప్రవేశాలకు గాను రెండో దఫా దరఖాస్తులను అభ్యర్థులు ఈనెల 25వతేదిలోగా సమర్పించాలని ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం 27న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. టెన్త్ పాసైన బాలికలకు అన్ని విభాగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కలవన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కృషివిజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



**శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త :** మండలంలోని కర్లగట్ట పంచాయతీ తంబిగానిపల్లి వద్ద సర్వే నెం 66 చెత్త గుట్ట ప్రాంతంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు మంగళవారం ఎమ్మెల్సీ డా॥కంచర్ల శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారులు స్థలాలను పరిశీలించారు. కేం ద్ర ప్రభుత్వ అధ్వర్యంలో ఈ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకానుంది. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, రుద్రప్ప, శాంతారాం, సత్యే ంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీచే రైతులకు టార్పాలిన్లు, డ్రమ్ములు పంపిణీ



**శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త :** మండలంలోని అబకలదొడ్డి గ్రామంలో మండలంలో 159మంది మహిళా రైతులకు టార్పాలిన్లు, డ్రమ్ములను ఎమ్మెల్సీడా॥ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. ఎస్సీ కార్పోరేషన్‌ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులకు వీటిని పంపిణీ చేశారు. ఒక్కో లబ్దిదారుకు రెండు టార్పాలిన్లు, రెండు డ్రమ్ములు అందించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, సింగిరి శ్రీనివాసులు, రమేష్, వెంకటేష్, అనసూయ, సుగుణమ్మ, మురుగేష్ పాల్గొన్నారు.

## రాహూల్ గాంధీకు ప్రజానివాళి



**పుంగనూరు,జూలై 2 ప్రభాతవార్త:** పార్లమెంటులో భారతదేశ హిందువులను ఉగ్రవాదులుగా పేర్కొంటూ కాంగ్రెస్‌నేత రాహూల్‌గాంధీ బతికి ఉన్నప్పటికీ తమ దృష్టిలో మరణించిన నేతతో సమానమనిపేర్కొంటూ పుంగనూరులో హిందూ సంఘాలు మంగళవారం నివాళి అర్పించాయి. పుంగనూరు హిందూ సమాజం పిలుపు మేరకు ఉదయం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నారు. రాహూల్ చిత్రపటాన్ని పాడెపై మోసుకువచ్చి, సర్కిల్ వద్ద చితికి నిప్పంటించి దహనసంస్కారాలు చేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా త్రిమూర్తిరెడ్డి, రాజేష్‌శర్మలు మాట్లాడుతూ ఈదేశంలో బతుకుతూ, ఈదేశ ఔన్నత్యాన్ని, ఈదేశ ధర్మాన్ని, ఈదేశ హిందువులను కించపరుస్తూ రాహూల్ చేసిన వాఖ్యలు యావత్ దేశ ఔన్నత్యంపై దాడిచేసినట్లే అన్నారు. కార్యక్రమంలో హిందూజాగరణ సమితి, ఆరెస్సెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నల్లారి కిరణ్‌కుమార్‌ను కలసిన సుకుమార్



**పుంగనూరు,జూలై 2 ప్రభాతవార్త:** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని దేశం నియోజకవర్గ బోయవాల్మీకి సంఘ అధ్యక్షుడు సుకుమార్‌బాబు మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కలికిరిలో ఆయన స్వగృహంలో వీరి భేటీ జరిగింది. విశ్రాంత డిఎస్పీగా ఉన్న సుకుమార్‌బాబు రాష్ట్రవాల్మీకి సంఘ అధ్యక్షుడుగా ఉన్న తరుణంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లాబాబుల పిలుపుమేరకు తెలుగుదేశంపార్టీలో చేరారు.

## ఇక అంగన్‌వాడీలలో...

### బాబు, పవన్, సంధ్యారాణిల చిత్రపటాలు



**పుంగనూరు,జూలై 2 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్‌వాడి, మహిళాసంఘాల భవనాలలో బాబు, పవన్, సంధ్యారాణిల చిత్రపటాలు తప్పని సరిగా ఉంటేనే శోభిల్లుతుందని విశ్రాంత డిఎస్పీ సుకుమార్ బాబు అన్నారు. మంగళవారం ఉదయం ఆయన అధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 34 అంగన్‌వాడీ కేంద్రాలకు సిఎం, డిప్యూటీ సిఎంలతో పాటూ రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సంధ్యారాణి ఉన్న చిత్రపటాలను పంపిణీ చేశారు. సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు తన విరాళంతో చిత్రపటాలను అంగన్‌వాడి కేంద్రాలకు అందించడం గర్వకారణమన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, జూలై 2 ప్రభాతవార్త:** కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం జిల్లా నూతన కోర్టులోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో జిల్లా జడ్జి ఇ.భీమారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఇటీవల నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్‌కుమార్ మర్యాద పూర్వకంగా జిల్లా జడ్జిని కలిశారు.

## ప్రభుత్వ శాఖల్లోని ఎన్ఎంఆర్ జీతాల పెంపు

**చిత్తూరు, జూలై 2 ప్రభాతవార్త:**

2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికుల వేతనాలను పెంచుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సచివాలయంలోని సమావేశభవనంలో మంగళవారం ప్రభుత్వ శాఖల్లోని ఎన్ఎంఆర్‌లు, మజ్దూర్ కార్మికుల వేతనాల పెంపుపై జిల్లా కార్మికశాఖ ఇన్‌ఛార్జీ అధికారి ఓంకార్‌రావుతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు 2024 ఏప్రిల్ 1 నుండి ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఎన్ఎంఆర్‌లు, మజ్దూర్ కార్మికుల వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన వేతనంపై 5 శాతం పెంచి చెల్లించే విధంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ నిర్ణయం మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పని చేయు నైపుణ్యం లేని కార్మికులకు రోజుకు రూ.538, మున్సిపాల్టీ పరిధిలో పని చేసే వారికి రూ.621, కార్పొరేషన్లలో విధులు నిర్వర్తించే వారికి రూ.278గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ పెంచిన వేతనాలు ఏప్రిల్ నెల నుండి అమలులోకి వస్తాయని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి రాజశేఖర్, ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, పిఆర్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, సహాయ కార్మికశాఖ అధికారి జగదీష్‌బాబు, కాణిపాకం దేవస్థానం సహాయ కార్యనిర్వాహణ అధికారి రవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

**తవణంపల్లె, జూలై 2 ప్రభాతవార్త:** ఐరాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తవణంపల్లె మండలం నారసింహపల్లెలో ఖాళీగా అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ జి.నిర్మల, సూపర్‌వైజర్ పి.లావణ్యలు తెలిపారు. ధరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు 10వ తరగతి పాసై 21 న ఉండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి వుండి, స్థానికులైన వివాహితులుగా వుండాలని తెలిపారు. అలాగే ఈపోస్టుకు బిసీ ఎ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంభందిత ధృవీకరణ పత్రాలతో పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 19 లోగా ఐరాల క్రాస్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని వారు తెలిపారు.

## మానవత్వాన్ని చాటుకొన్న క్రాంతి కుమార్

**చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త :** అనారోగ్యం రిత్యా ఆసుపత్రిలో వైద్యం చేయిచంచుకొంటున్న వ్యక్తికి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను అందించి డిజిటల్ అసిస్టెంట్ క్రాంతి కుమార్ మానవత్వాన్ని చాటుకొన్నాడు. మండలంలోని వెంగళపల్లికి చెందిన గంగాధర్ మూత్ర పిండాల వ్యాధితో బాధ పడుతున్నాడు. ప్రస్తుతం అతను తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. గంగాధర్ డయాలసిస్ పింఛన్‌ను ప్రభుత్వమందిస్తోంది. కూటమి ప్రభుత్వ సారధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ క్రాంతి తిరుపతి ఆసుపత్రికి వెళ్ళి గంగాధర్‌కు పింఛను మొత్తాన్నందించాడు. ప్రతి ఒక్కరికీ పింఛను అందాలన్న ప్రభుత్వ పిలుపు మేరకు తాను గంగాధర్‌కు పింఛను అందించినట్లు క్రాంతి తెలిపాడు. ఆయన్ను పలువురు అభినందించారు.

## వెంకట్రమణ మృతి పార్టీకి తీరని లోటు : గువ్వల



**చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త :** వెంకట్రమణ మృతి పార్టీకి తీరని లోటని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంకు చెందిన తేదేపా సీనియర్ నాయకుడు వెంకట్రమణ(65) మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి మృతుడి కుటుంబానికి సంతాపాన్ని వ్యక్తం చేసారు. మండల నాయకులు వాసుదేవరెడ్డి, వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయండి

**చిత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:**



అసంపూర్తిగా వున్న వరదప్ప నాయుడు పురపాలక ఉన్నత పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేసి 2024-25 విద్యాసంవత్సరపు తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు చిట్టిబాబు కొల్లా డిమాండ్ చేసారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగపు పర్యవేక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి టాయిలెట్స్, ఎలక్ట్రికల్ పనులు చేయకపోవడంతో సంవత్సర కాలం నిరుపయోగంగా వుందన్నారు. దీంతో వీధి వ్యాపారులు ఆక్రమించుకొని దుకాణాలను ఏర్పాటుచేసుకోవడంతో పాటు అధికారులకు అనధికార అద్దె చెల్లిస్తున్నామని చెప్పడం గమన్హామని పేర్కొన్నారు.

## శ్రీసత్యసాయి విధివిధానాలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు



**చిత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి బాలవికాస్ విధివిధానాల ద్వారా మానవతా విలువలతో విద్యార్థులకు విద్యను బోధించి వారి జీవితాలకు బంగారుబాట వేయవచ్చునని శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మధుసూదనం పేర్కొన్నారు. మంగళవారం దేవిబాల మందిర్ హైస్కూల్ నందు నూతన బాలవికాస్ సెంటర్‌ను బాలవికాస్ సమన్వయకర్త వసంత, గురువు ఇందిరా ప్రియదర్శినిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు భజనలు, చిన్న చిన్న నీతికథలు, డ్రాయింగ్, సంగీతం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శేషనారాయణ, సేవా ఆర్గనైజేషన్ ఆధ్యాత్మిక సమన్వయకర్త దేవరాజు, దేవిబాలమందిర ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రధానపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గిరిజన కాలనీలో తాగునీరు పునరుద్ధరణ

– ఇఓఆర్‌డి, మెడికల్ సిబ్బంది పర్యవేక్షణ

**చిట్టమూరు, జూలై 2 ప్రభాతవార్త :**



చిట్టమూరు మండలంలోని తీం ప్రాంత గ్రామమైన గొల్లలనట్టు గిరిజన కాలనీకి తాగునీటిని అందించినట్లు ఇఓఆర్‌డి మనోహర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం 'వార్త' దినపత్రికలో ప్రచురితమైన 'గిరిజనులకు దొరువు నీరే దిక్కు' అనే వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం ఇఓఆర్‌డి మనోహర్‌గౌడ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ అరవింద్ గొల్లలనట్టు గ్రామానికి వెళ్లి తాగునీటి ఎద్దడిపై గ్రామస్థులతో మాట్లాడారు. తమ కాలనీకి తాగునీరు సక్రమంగా అందక దొరువునీటినే తాగుతున్నట్లు కాలనీవాసులు చెప్పడంతో తాగునీటి సమస్యకు ముఖ్య కారణమైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించారు. మంగళవారం సైతం వైద్య సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లిన మనోహర్‌గౌడ్ దొరువులో బ్లీచింగ్ చల్లి మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కాలనీ వాసులు దొరువునీటిని వాడరాదని, ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, పరిష్కరిస్తామని ఇఓఆర్‌డి ఈ సందర్భంగా గిరిజనులకు భరోసా కల్పించినట్లు చెప్పారు. తమ కాలనీలో ఎంతో కాలంగా తాగునీటి సమస్య ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు కన్నెత్తి చూడకపోవడం 'వార్త' దినపత్రికలో తమ గ్రామ దుస్థితిపై కథనం ప్రచురితం కాగానే అధికారులు స్పందించడం పట్ల వారు ఈ సందర్భంగా అభినందించారు.

## నూతన చట్టాలపై అవగాహన అవసరం

**తడ, జూలై 2 ప్రభాతవార్త :**



కొన్ని తరాలుగా ఉన్న బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన చట్టాల స్థానంలో నూతనంగా మన దేశ చట్టాలు అమల్లోకి వచ్చాయని, వాటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకో వాల్సిన అవసరం ఉందని నాయుడుపేట డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తడ పోలీసుస్టేషన్ వద్ద స్థానికులతో ఆయన మాట్లాడారు. కొత్తగా వచ్చిన చట్టాల గురించి వివరించారు. అవి వెంటనే అమల్లోకి వచ్చాయని, వీటి గురించి పూర్తిగా గ్రామాల్లో కూడా అవగాహన కల్పిస్తామన్నారు. సరిహద్దు ప్రాంతం కావడం వల్ల తడలో శాంతిభద్రతల విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. సూళ్ళూరుపేట సీఐ మధుబాబు, స్థానిక ఎస్ఐ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 4న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**కోట, జూలై 2 ప్రభాతవార్త :**

నీట్, యూజీసీనెట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ జూలై 4 వ తేదీన దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేయాలని విద్యార్ది సంఘాలు పిలుపునిచ్చాయి. మంగళ వారం కోట మండలం విద్యానగర్‌లో విద్యార్ది సంఘాల నాయకులు మాట్లాడుతూ... వన్ నేషన్... వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్ప కూలిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహిచడంలో విఫలమైందని ఆరోపించారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా విద్యార్ది సంఘాలు బంద్ కు పిలుపునిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, వాసు తదితరులు పాల్గొన్నారు

## పింఛన్ల పంపిణీలో సూళ్ళూరుపేట నియోజకవర్గం గ్రేట్

**తడ, జూలై 2 ప్రభాతవార్త :**



జూలై 1న కొత్త ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో రాష్ట్ర వ్యాప్తంగా జోరు చూపించగా, ప్రత్యేకించి సూళ్ళూరుపేట నియోజక వర్గంలో శభాష్ అనిపించే రీతిలో పింఛన్లు పంచారు. యాప్‌లు పనిచేయకుండా సర్వర్లు మొరాయించినప్పటికీ నియోజకవర్గం లోని ఆరు మండలాలు, రెండు పురపాలక సంఘాలలో ఇతర ప్రాంతాల కన్నా ఎక్కువ శాతం పింఛన్లు పంపిణీ చేశారు. 1వ తేదీ రాత్రి 8 గంటల వరకు పంపిణీ అయిన పింఛన్లలో తిరుపతి జిల్లా అధికారులు ప్రకటించిన మేరకు మొదటి రెండుస్థానాలు సూళ్ళూరుపేట నియోజకవర్గానివే. నాయుడుపేట మండలంలో 97.8 శాతం, సూళ్ళూరుపేట మున్సిపాలిటీలో 97.59 శాతం పింఛన్లు పంపిణీ జరిగినట్లు ప్రకటించారు. ఇక నాయుడుపేట మున్సిపాలిటీలో 96.79 శాతం పింఛన్లు పంపిణీ చేసి జిల్లాలో 6వ స్థానం సాధించినట్లయింది. 10, 11, 12, 14 స్థానాల్లో దొరవారిసత్రం, సూళ్ళూరుపేట మండలం, పెళ్లకూరు, తడ మండలాలు ఉన్నాయి. ఇవి వరుసగా 96.54, 96.51, 96.07, 96 శాతంగా నమోదయ్యాయి. నియోజకవర్గ పరిధిలో ఒక్క ఓజిలి మండలం మాత్రమే పింఛన్ల పంపిణీలో కొంత వెనుకబడింది. మొత్తం 41 మండలాలకు గాను ఓజిలి మండలం 33వ స్థానంతో 93.71 శాతం పింఛన్ల పంపిణీకి పరిమితమైంది. ముందురోజు నుంచే సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఆయా మండలాల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి టీడీపీ నాయకులు, కూటమిలోని బిజెపి, జనసేన నాయకులు కూడా తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీకి శ్రీకారంచుట్టడంతో ఇంత పెద్దసంఖ్యలో కోట్లాది రూపాయలు పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు అధికార వర్గాలు అంటున్నాయి.

## పరపతి సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జులు నియామకం

**కోట, జూలై 2 ప్రభాతవార్త :**

వైకాపా పాలనలో అక్రమాలతో నష్టాల నట్టేట మునిగిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కొత్త ప్రభుత్వం రాకతో మంచి రోజులు వచ్చాయి. వీటిని గాడిన పెట్టడానికి అన్ని పీఏసీఎస్‌లకు అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జులుగా సర్కారు నియమిచింది. సహకార శాఖ అధికారులు ఈ బాధ్యతలను అప్పగించింది. ఎన్నికల జరిగి కొత్త పాలక వర్గం ఏర్పాటయ్యే వరకూ సహకార అధికారులకే వీటిపై పూర్తి అధికారాలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోట మండలంలో ఊనుగుంట పాళెం, సిద్దవరం, తిన్నేలపూడి సొసైటిలకు మహేష్‌సింగ్‌ను నియమించారు. చిట్టేడు, కొత్తపాళెంకు ఎన్.శ్యామల రావును నియమించారు. గూడూరు డివిజన్‌లో 34సంఘాలకు నూతన అధికారులను నియామించారు. ఆరు నెలలపాటు వీరు ఇందులో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పీఏసీఎస్‌లు కీలకపాత్ర పోషిస్తాయి. రైతులకు కొత్త రుణాలు ఇవ్వడంలో పాటు పాత రుణాలు పునరుద్దరిస్తారు

## ఇక రైతు సేవా కేంద్రాలు

**కోట, జూలై 2 ప్రభాతవార్త :**

రైతు భరోసా కేంద్రాలను ఇక నుంచి రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయశాఖకు ఆదేశాలు అందాయి. వైసీపీ ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటు చేసి ఆ పరిధిలోని ఆర్‌బికెలను ఏర్పాటు చేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు వీటి ద్వారానే అందిస్తున్నారు. రైతులకు సమాచారం అందించే రైతు భరోసా మ్యాగజైన్లు కూడా పాడిపంటలుగా పేరు మార్చారు. రైతు సేవా కేంద్రాలుగా మార్చుతూ ఆదేశాలు అందాయని వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు.

## సుబ్బన్న సేవలు అభినందనీయం

**కోట, జూలై 2 ప్రభాతవార్త :**



మండలకేంద్రమైన కోటలోని ఎంఇఒ కార్యాలయాంలో అటెండర్‌గా పని చేస్తున్న సుబ్బన్న సేవలు అభినంద నీయమని కోట మండల యుటిఎఫ్ అధ్యక్షులు ముప్వల మనోహర్ అన్నారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సుబ్బన్న పదవి విరమణ చేశారు. ఈ సందర్బంగా యుటిఎఫ్ పక్షాన ఆయనను ఘనంగా సన్మానించారు. ఎప్పుడు కార్యాలయాలంకు వెళ్లిన ఎంతో ఆపాయ్యంగా అందరిని పలకరించే వారుని యూనియున్ నాయకులు గుర్తు చేశారు. 20 సంవత్సరాలగా ఆఫీస్‌లో సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెల్లంగిణిమ్మ, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## ఇక రైతు సేవా కేంద్రాలు

**కోట, జూలై 2 ప్రభాతవార్త**

రైతు భరోసా కేంద్రాలను ఇక నుంచి రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయశాఖకు ఆదేశాలు అందాయి. వైసీపీ ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటు చేసి ఆ పరిధిలోని ఆర్‌బికెలను ఏర్పాటు చేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు వీటి ద్వారానే అందిస్తున్నారు. రైతులకు సమాచారం అందించే రైతు భరోసా మ్యాగజైన్లు కూడా పాడిపంటలుగా పేరు మార్చారు. రైతు సేవా కేంద్రాలుగా మార్చుతూ ఆదేశాలు అందాయని వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు.

## పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తం

**పాలసముద్రం, జూలై 2 ప్రభాతవార్త:**

పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా వుండాలని పశుసంవర్థకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని శ్రీకావేరిరాజపురంలో మంగళవారం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పశుసంవర్థకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ పాడి రైతులు సరైన సమయంలో పశువుల ఎద లక్షణాలు గుర్తించి గోపాలమిత్ర ద్వారా చికిత్స చేయించుకోవాలని సూచించారు. పాడి రైతులు పశుగ్రాసం పెంచడం, దూడల పెంపకం, లింగ నిర్ధారణ వీర్యం, ఎద లక్షణాలు గురించి ఈ సందర్భంగా ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాలి మహేష్, డిఎల్‌డిఏ ఇఓ డాక్టర్ బాలసుబ్రమణ్యం, తిరుపతి ఎస్‌డిఎల్‌డిఏ ఏఏ డఆక్టర్ సుబ్బారావు, పుత్తూరు డిడి డాక్టర్ మోహన్, జెవివిఓ లోకనాథంరెడ్డి, మండల పశువైద్య అధికారి డాక్టర్ యశస్విని, జిడినెల్లూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళీమోహన్, తిరుమలరాజపురం వీఏఎస్ అనుజ్య, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు సాంబశివన్, టిడిపి నాయకులు బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాధినిరోధక అధికారిచే ఆకస్మిక తనిఖీ

**రొంపిచెర్ల, జూలై 2 ప్రభాతవార్త :**



రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ అనిల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అతిసారం నివారణ గురించి, చేతులు పరిశుభ్రత గురించి, ఓఆర్ఎస్ ప్రాముఖ్యత గురించి, జింక్ మాత్రల గురించి తెలిపారు. ఈసందర్భంగా ఈ నెల1 నుంచి ఆగస్టు 31 వ తేదీ వరకు స్టాప్ మలేరియా కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు ఇళ్లను సందర్శించి ఓఆర్ఎస్, జింక్‌మాత్రలు వంటి వాటి గురించి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.దినేష్‌కుమార్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, సీహెచ్ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు వేసుకోండి

**కల్లూరు, సదుం, జూలై 2 ప్రభాతవార్త :**

పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ మిని కార్యకర్త ఒక పోస్టు, అంగన్‌వాడీ సహాయకులు 5 పోస్టులకు గాను అర్హులైన మహిళలు ధరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ నాగశైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 వతేదీ నుంచి 19 వ తేదీ సాయంత్రం వరకు పులిచెర్ల సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

## డిప్లొమో కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు : జిల్లా కలెక్టర్

**సదుం, జూలై 2 ప్రభాతవార్త :**



ఈకాలంలో వెటర్నరీ డిప్లొమా కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన సదుం మండల పరిషత్ కార్యాలయం వద్దకు విచ్చేశారు. అనంతరం అక్కడి నుంచి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎందుకు తొందరగా చేయలేదని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈప్రాంతంలో వ్యవసాయ, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు వ్యవసాయా పశు ఆధారిత రంగాలపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ఆయన వెంట జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి, తహశీల్దారు నారాయణస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ , సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి గౌడ సంఘం వర్కింగ్ అధ్యక్షుడి రాజీనామా

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా గౌడ సంఘం వర్కింగ్ అధ్యక్షుడుగా ఉన్న తిరుకాల మల్లికార్జున్‌గౌడ్ తనపదవికి రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘ కుల సంఘాల క్రియాశీలక బాధ్యతలు నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు తనకు సహకరించిన గౌడ కుటుంబ సభ్యులకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 9వ వార్డులో ఫించన్లు పంపిణీ పూర్తి

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం జూలై నెల నుంచే ఫించను వృద్దులు, వితంతువులు, ప్రత్యేక ప్రతిభావంతులు, ఇతర కేటగిరీల్లో ఉన్న వారికి ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీనే సచివాలయ ఉద్యోగులతో ఎన్డీయే కూటమి అభ్యర్ధుల మద్య 9వ వార్డులో లబ్దిదారులకు ఫించను పంపిణీ చేసినట్లు మాజీ కౌన్సిలర్ శెంజిగరం సుప్రజ, వేలు, బిజెపి నాయకురాలు చాగణం శైలజల ఆధ్వర్యంలో ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించండి

తొట్టంబేడు, జూలై 2 ప్రభాతవార్త :



ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు అన్నారు. మంగళవారం కొణతనేరి సచివాలయాన్ని సందర్శించి అక్కడ ఉన్న సిబ్బందికి పలుసూచనలు చేశారు. నియోజకవర్గ శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు దేశ చరిత్రలోనే ఫించన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా సచివాలయ సిబ్బంది సహకరించడంతో పూర్తిగా విజయవంతం చేయడంతో సచివాలయ సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. అర్హులైన వారందరికీ తెలుగుదేశం ప్రభుత్వం జీవో విడుదలైన వెంటనే ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, కల్లుగీత కార్మికులు అందరినీ పంచాయతీల్లో గుర్తించి న్యాయం చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇలగనూరు మాజీ సర్పంచ్ మధునాయుడు, పులి కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ విద్యార్ధులకు రాజ్యపురస్కార్ అవార్డులు

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



గుంటూరులోని తాడికొండలో ఉన్న రాష్ట్ర భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో ఈఏడాది ఏప్రిల్ 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపులో బాబుఅగ్రహారం పురపాలక సంఘం పాఠశాలకు చెందిన ఐదుమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో పి.వినోద్, పి.మురళీకృష్ణ, ఎస్.శ్రీనివాసులు, ఏ.యశ్వంత్, జె.లోకేష్‌లు ఉన్నారు. వారంరోజుల పాటు నిర్వహించిన టెస్టింగ్ క్యాంపులో అవార్డులకు అర్హత సాధించారు. వీరికి రాష్ట్ర గవర్నర్ రాష్ట్ర భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షులు అబ్దున్‌నజీర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్స్ అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన ఎస్‌కె.అజారుద్దీన్, కమిషనర్లు ఎంఎంరెడ్డి, జిల్లా కార్యదర్శి టి.రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి ఎం.జయరాం, సహాయ కమిషనర్ పార్వతీ,డిటిసి సావిత్రి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, ఉపాధ్యాయులు యోగానందం తదితరులు అభినందనలు తెలిపారు.

## ఆధ్యాత్మిక వేత గిరిధర్‌ను సత్కరించిన గ్రామస్తులు

ఏర్పేడు,జూలై 2 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తికి సమీపంలోని ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి కన్‌స్ట్రక్షన్స్ అధినేత గిరిధర్‌రెడ్డిని సర్పంచ్ పెంచలయ్యను ఘనంగా సత్కరించారు. శ్రీహరి కన్‌స్ట్రక్షన్స్ అధినేత చిందేపల్లి సిద్దేశ్వరాలయం ధర్మకర్త గంగల పూడి గిరిధర్‌రెడ్డిని ఆయన పుట్టినరోజు సందర్భంగా చిందేపల్లి సర్పంచ్ పెంచలయ్యను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్చం అందించి పుటిద్టనరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## గిరిజనకాలనీ రోడ్డుకు మోక్షం : బొల్లినేని

శ్రీకాళహస్తిరూరల్ జూలై 2 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి నియోజక వర్గం రాచగున్నేరి మాజీ సర్పంచ్ టిడిపి సీనియర్ నాయకులు బొల్లినేని జగన్నాధం నాయుడు సామాజిక కార్యక్రమాల్లో తన మార్కును చూపిస్తున్నారు. గతంలో గ్రామ సర్పంచ్‌గా పని చేసిన ఆయన అభివృద్దికి సంబంధించి అవగాహన కల్గి ఉన్నారు. ఈ నేపధ్యంలో గ్రామంలో పరిశుభ్రతపై దృష్టి సారించారు. ఎంతో కాలంగా గిరిజన కాలనీ వాసులు ముళ్ళ రాళ్ళ బాటలో పయనించే వారు. ఈ సమస్యను గుర్తించిన జగన్నాధం నాయుడు మంగళవారం వంకరాయి మిట్ట ఎస్టీ కాలనీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ళపొదలను జెసిబిలతో అడ్డుతొలగించి రోడ్డును రోడ్డుకి బాటా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు వంకరాయిమిట్ట గ్రామంలో సేవ పనులను చేపడుతున్నట్టు తెలిపారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోక పోతే అంటు వ్యాధులు ప్రబలే వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీకళాశాల అడ్మిషన్లు ప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :

పట్టణంలోని స్వామివిద్యాప్రకాశనంద పురుషుల డిగ్రీకళాశాల 2024-25 విద్య సంవత్సరానికి డిగ్రీ కోర్సులో ప్రవేశం కొరకు ఉన్నతవిద్యామండలి నోటిఫికేషన్ జారీ చేశారని ప్రిన్సిపల్ శ్రీలత మంగళవారం పత్రికల వారికి తెలిపారు. ఈ కోర్సుల్లో చేరాలనుకున్న వారు ఓఏఎండిసిపోర్టల్ నందు మంగళవారం నుంచి 10 వ తేది వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. అనంతరం ఈ నెల 19 న సీట్ల కేటాయింపు జరుగుతుందని సీట్లు పొందిన విద్యార్దులు ఈ నెల 20 నుంచి 22 లోపు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుదన్నారు. ఇతర వివరాలకు మాజీ ప్రిన్సిపల్ కె.నరసింహవర్మ 9440167239 సంప్రదించాలన్నారు.

## వసతిగృహ బాలికలకు దుప్పట్లు పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయం ఎదురుగా ఉన్న బాలికల వసతిగృహాలు-1,2లో ఉంటున్న బాలికలకు మంగళవారం ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో బాలికలకు దుప్పట్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా వసతిగృహాలను పరిశీలించి ఇక్కడ కావాల్సిన సౌకర్యాలపై ఆరాతీశారు. బాలికల వసతిగృహంలో వారికి కావాల్సిన మౌళిక వసతులను కల్పించేందుకు చర్యలుతీసుకుంటామని తల్లిదండ్రులను వదలి చదువుకోవడానికి వచ్చిన బాలికలకు చక్కని భోజనం పెట్టాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. ఇబ్బందులు ఎవైనా ఉంటే వెంటనే తనదృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు షాకిరాలీ, వార్డెన్లు , బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ఘాట్‌లో కార్చిచ్చు

తిరుమల,జూలై 2ప్రభాతవార్తప్రతినిధి:



భక్తులు తెలియక చేసిన తప్పిదంతో తిరుమల మొదటిఘాట్‌లో మంటలు వ్యాపించి పచ్చని చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లో 31వ మలుపువద్ద జరిగింది. తిరుమలలో కొందరు భక్తులు తమ మొక్కులుతీర్చుకుని వెనుదిరిగారు. కర్పూర హారతులిచ్చారు. ఈ కర్పూరం క్రిందపడటంతో మెల్లగా చెత్తకు అంటుకుని చెట్లు కాలిపోయాయి.

## మినీ అంగన్‌వాడీపోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి, జూలై 2 ప్రభాతవార్త:

నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి మున్సిపాలిటీ నింద్ర, విజయపురం మండలాల్లో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 19 తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

## 4న విద్యా సంస్థల బంద్‌ని జయప్రదం చేయాలి : ఏఐఎస్ఎఫ్

పుత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:

4 తేదీ జరగబోయే దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, పుత్తూరు పట్టణ అధ్యక్షులు దిలీప్ దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాలని విద్యకు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కార్పొరేట్ పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని తెలిపారు. ఈ బంద్‌ను జయప్రదానికి విద్యార్థులు మేధావులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు మేధావులు, విద్యార్థి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విక్రమ్, కళై తదితరులు పాల్గొన్నారు.

## నేను బడికి పోతా!

పుత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:



ప్రభుత్వ ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని నేసనూరు పంచాయతీకి చెందిన మొగిలి అమ్మ కాలనీలో బడికి పోతూ ఉండి పూర్తిగా బడికి మానేసిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం జరిగింది. గ్రామాల్లో పర్యటించి గ్రామంలో ఉన్న విద్యార్థులు పాఠశాలల్లోనే ఉండాలని అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలరాజు, సుబ్రహ్మణ్యంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయన్, పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిలక్ష్మి, నేసనూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అతిసారపై అవగాహన

విజయపురం, జూలై 2 ప్రభాతవార్త:



మండలంలో డయేరియాపై మంగళ వారం వైద్య సిబ్బంది డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అతిసార వ్యాధి నుంచి పిల్లలను రక్షించాలని అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విష్ణుప్రియ, ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నా ప్రాణం ఉన్నంత వరకు విశ్వాసంగా ఉంటా

విజయపురం, జూలై 2 ప్రభాతవార్త:



నా ప్రాణం ఉన్నంత వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విశ్వాసంగా ఉంటానని విజయపురం మండలం ఇళ్ళత్తూరుకు చెందిన దివ్యాంగుడు కన్నీటి పర్యంతమయ్యాడు. మంగళవారం దివ్యాంగ పింఛన్ రూ.15లు తీసుకోవడంతో ఆనందానికి అవధి లేకుండా పోయింది. పుట్టకతో వికలత్వం వలన మూడు చక్రాలకు పరిమితం కావడంతో వస్తున్న పింఛన్‌తో ఆస్పత్రి ఖర్చులకు చాలీచాలక కుటుంబాన్ని నెట్టుకుంటూ వచ్చారు.

## మహిళ మెడలో తాళి లాక్కున్న ఆకతాయిలు!

శ్రీకాళహస్తిరూరల్,జూలై 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం గ్రామం వద్ద వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని తాళిబొట్టును ద్విచక్ర వాహనాలపై ఆకతాయిలు వచ్చి లాక్కుని వెళ్ళిన సంఘటన చుట్టుపక్కల గ్రామాల్లో సంచలనం సృష్టించింది. వివరాలు గ్రామస్తులు అందించిన మేరకు ఇలా ఉన్నాయి. అమ్మపాళెం గ్రామానికి చెందిన ఓ మహిళ సాయంత్రం వాకింగ్ చేస్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాలపై హెల్మెట్లు ధరించి రోడ్డుపక్కన నిలబడి నిరీక్షిస్తున్నట్లు సమాచారం. వాకింగ్ కోసం వచ్చిన ఆమె మెడలోని తాళి బొట్టును లాక్కొని వెళ్ళినట్లు తెలిసింది. అయితే రాత్రి వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. తాళిని లాక్కున యువకులు మిట్టకండ్రిగ వైపు వాహనాన్ని పరుగులు తీయించారు.

## ఐక్య ఉద్యమాలతోనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం:

శ్రీకాళహస్తి రూరల్,జూలై 2 ప్రభాతవార్త :



ఐక్యఉద్యమాలతోనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరింపబడతాయని ఆశావర్కర్ల సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తంజావూరు మునేంద్ర అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సిహెచ్ రాణెమ్మకు యూనియన్ తరఫున సన్మాన సభను ఏర్పాటు చేసారు. ఈ సభకు మునేంద్ర అధ్యక్షత వహిస్తూ ముఖ్య అతిధిగా వచ్చారు. ఈకార్యనరకమాల్లో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.కుమార్‌రెడ్డి,రాష్ట్ర అధ్యక్షులు జహీరా,పవనమ్మ, కోశాధికారి ఏ.హరీష్, లక్ష్మీ తులసి, శాంతకుమారి, భారతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ తరఫున రాణెమ్మకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు.

## తమ నాయకుడిని సత్కరించుకోవడం ఆనందం

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



తిరుపతి తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు పుట్టినరోజు వేడుకలను యువత తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుయువత నాయకుడు వంకాయల సిద్దులయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా రూపొందించిన కేక్‌ను కట్‌చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా వంకాయల సిద్దులయ్య మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకున్ని సత్కరించడం తమ అదృష్టమన్నారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఒకటో తేదీనే ఇచ్చిన మాట ప్రకారం ఫించను రూ.4వేలతో పాటు మూడు నెలలకు మరో రూ.3వేలు అందించి మొత్తం రూ.7వేలు అందించిన ఘనత దక్కించుకున్నారన్నారు. పెంచిన ఫించనుతో నిరుపేదల్లో ఆనందం కనపడు తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. పుట్టినరోజు వేడుకల్లో గంగలపూడిహరి, అనిల్, వాసు, రామచంద్రయ్య, పుల్లూరుసుబ్రమణ్యంలతోపాటు పలువురు తెదేపా శ్రేణులు పలువురు చెంచయ్యనాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## పెన్షన్ల పెంపుతో టిడిపి ప్రజల పక్షమని రుజువైంది : టిడిపి నేతలు

పుత్తూరు, జూలై 2 ప్రభాతవార్త :




పెన్షన్‌ల పెంపుతో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రజల పక్షమని నిరూపించిందని టిడిపి పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎస్.ధనపాల్ తెలిపారు. పుత్తూరు మునిసిపాలిటీలో పెంచిన పెన్షన్‌లు 5,836 మందికి రూ. 4.03 కోట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా వున్నపుడు రాష్ట్రంలో సామాజిక భద్రతా పెన్షన్లు ప్రవేశపెట్టారన్నారు. టిడిపి ఎపుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని తెలిపారు.

## రైతులను ఆదుకొనే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే : ఎమ్మెల్యే

నారాయణవనం, జూలై 2 ప్రభాతవార్త :



తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే రైతులకు అన్ని విధాల సాయం అందుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు ప్రకృతి వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలోనే రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సాయం అందుతుందని, సిఎం చంద్రబాబు ప్రవేశ పెట్టె ప్రతి కార్యక్రమాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. చంద్రన్న పాలనలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు పనిముట్లను అందించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను, జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్‌ని సూపరింటెంటెండ్ గుణశేఖర్, ఎఓ శోభారాణి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది నీలిమ, సిబ్బంది దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు.

## పుత్తూరు ఆరీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం : ఎమ్మెల్యే

నారాయణవనం, జూలై 2 ప్రభాతవార్త :



పుత్తూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ్లలో కెవిబిపురం మండలం దిగువ పుత్తూరు వరకు వయా ఎగువ పుత్తూరుకు, అలాగే పుత్తూరు డిపో నుంచి ఊతుకోట వరకు ఉదయం, సాయంత్రం వేళ్లలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్టు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించడంతో ఆనందం వ్యక్త పరిచారు.

## ఈనెల 5 నుంచి పరాశారేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, జూలై 2 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ బజారువీధిలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 14 వరకు జరుగుతుందని టిటిడి అధికారులు తెలిపారు. కళ్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు 500 రూపాయాలు చెల్లించాలని కోరారు.

## నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక నియామకం

నగరి, జూలై 2 ప్రభాతవార్త:

నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోరాజనీతి శాస్త్ర విభాగం, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బోధన కొరకు తాత్కాలిక ప్రాతిపదికపై, అతిథి అధ్యాపక నియామకం కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఎంఏ పోస్టు గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి, రాజనీతి శాస్త్రంలో ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ-నెట/ఏపీసెట్/ఏపీ స్లెట్ అర్హతలు కలిగిన వారికి రాజనీతి శాస్త్రంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. పై అర్హతలు కలిగి, ఆసక్తి గల అభ్యర్థులు 4న గురువారం ఉదయం 11.30 గంటలకు కళాశాలలో హాజరు కావాల్సి ఉంటుందని తెలియజేశారు.

## మాట తప్పని చంద్రన్న : సర్పంచ్

కేవీబీపురం, జూలై 2 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని 3వేలు నుంచి 4వేలకు పంపిణీ చేసి మాట తప్పని ముఖ్యమంత్రిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అలాగే దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలువంటి ఇతర పెన్షన్లను సైతం హామీ మేరకు పెంచి నేడు రాష్ట్రం మొత్తం పంపిణీ చేస్తూ ప్రజా పట్ల తమ అధినేతకు ఉన్న విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. తిమ్మసముద్రంలో ఇంటింటికి వెళ్లి ఎన్‌టీఆర్ పెన్షన్ పథకం నగదును లబ్ధిదారులకు తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు పంపిణీ చేశారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ బొర్రా జయమ్మ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయానికి ప్రధాని, ముఖ్యమంత్రి ఫోటోలు వితరణ

కేవీబీ పురం, జూలై 2 ప్రభాతవార్త:

మండలంలోని కొండల ఆదవరం గ్రామ సచివాలయానికి భారత ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఫోటోలను తెలుగుదేశం పార్టీ ఆదవరం యూనిట్ ఇన్‌చార్జి గిరి యాదవ్ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వల్లి, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, రుద్ర యాదవ్, ఆకాష్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే సామాజిక పెన్షన్ల పంపిణీ

కేవీబీ పురం, జూలై 2 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న సామాజిక పెన్షన్ పంపిణీ జూలై 1న లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయనున్నట్లు మండల అభివృద్ధి అధికారి రెడ్డయ్య తెలిపారు. కార్యక్రమం జూలై1న సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రూ.7 వేలు పెన్షన్(నెలవారి పెన్షన్ రూ.4 వేలు ఏప్రిల్) నుంచి ప్రతి లబ్ధిదారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెన్షన్ దారుడికి పంపిణీ



కేవీబీ పురం, జూలై 2 ప్రభాతవార్త:

అనారోగ్యంతో నెల్లూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేవీబీ పురం మండలం వగత్తూరు గ్రామ పంచాయతీకి చెందిన పెన్షన్ దారుడు పాలమంగళం సుబ్రహ్మణ్యంకి రాయపేడు సచివాలయ సిబ్బంది జగదీష్ నెల్లూరుకి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ పెన్షన్ ఇవ్వడంతో సచివాలయ సిబ్బంది నరేష్‌కి, మణి, జగదీష్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## డెంగ్యూ నివారణకు విస్తృత పర్యటన చేపట్టండి

నగరి, జూలై 2 ప్రభాతవార్త:



డెంగ్యూ నివారణకు విస్తృత పర్యటన చేపట్టాలని టెస్టింగ్ సేంపుల్స్ సేకరణ కోసం నియమించిన ప్రత్యేక సిబ్బందికి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి సూచించారు. మంగళవారం సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను ఆమె తెలియజేశారు. డెంగ్యూ నివారణ మాసంలో చేపట్టవలసిన పనులు, ఎస్ఎస్‌హెచ్ ల్యాబ్ సేవల పట్ల చర్చించారు. నగరి రూరల్, నగరి మున్సిపల్ ప్రాంతాల్లో డెంగ్యూ అనుమానిత కేసులను గుర్తించి సెరా సేంపుల్స్ సేకరించి ఎలీసా టెస్టులకు ఆస్పత్రికి పంపాలన్నారు. వారం రోజుల పాటు జ్వరంతో బాధ పడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో మాత్రమే అందుబాటులో ఉండే ఎలీసా టెస్టులు చేయించాలన్నారు.

# ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పేదల జీవితాలకు వరం

## - ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, జూలై 2 ప్రభాతవార్త :
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పేదల జీవితాలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలోని కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం లాంటి మారుమూల ప్రాంతంలో నేడు పిఇఎస్ లాంటి వైద్యకళాశాలలు ఏర్పడినా, ఆధునాతన ఆస్పత్రులు ప్రారంభమైనా అది సిఎం చంద్రబాబు నాయుడు చలవేనన్నారు. పాతికేళ్ల క్రితమే కుప్పంలో వైద్య కళాశాల ఏర్పాటుకు సిఎం చంద్రబాబు చొరవ చూపారంటే అది ఆయన ముందు చూపుకు నిదర్శనమన్నారు. బ్రిటీష్ హయాం నాటి నుంచే రెవెన్యూ డివిజన్‌గా ఉన్న తమ సొంత ప్రాంతం కందుకూరులో సైతం నేటివరకు వైద్యకళాశాల ఏర్పాటుకాలేదన్నారు. తమ ప్రాంతంవారు చికిత్సలకోసం నెల్లూరు, చెన్నై, హైదరాబాదు లాంటి ప్రాంతాలకు పరుగులు తీస్తుంటారన్నారు. సిఎం చంద్రబాబు కుప్పానికి వైద్య, ఇంజనీరింగ్ కాలేజ్‌లు తేవడంతో నేడు నియోజకవర్గంలో యువత అంతా డాక్టర్లు, ఇంజనీర్లుగా అధిక సంఖ్యలో ఉండడం విశేషమన్నారు. మాజీ ఎంపిపి చౌడప్ప కుటుంబం అంతా డాక్టర్లుగా ఉండడం, ఆయన కష్టపడి చదివించిన నేపథ్యంలో త ండ్రిచూపిన మార్గంలోనే పయనించిన ఆస్పత్రి అధినేతలు డా॥ మంజునాథ్, బాలాజీలను అభినందిం చారు. పేదల పట్ల మరింత శ్రద్ధ చూపి వారికి మెరుగైన వైద్య సేవలు అందించి కుప్పానికి మరింత మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్ బాబు, గోపీనాథ్, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సత్యేంద్రశేఖర్, శాంతారాం, బిఎంకె రవిచంద్ర, బాబు, కౌన్సిలర్లు జిమ్‌దాము, వేలు, జాకీర్ పాల్గొన్నారు.

## డయేరియాపై విస్తృత స్థాయిలో ప్రచారం

### -కొటాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రియాంక

చంద్రగిరి, జూలై 2 ప్రభాతవార్త:




ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అనుసరించి డయేరియా పట్ల ప్రజల్లో చైతన్యం నింపుతూ విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని కొటాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రియాంక అన్నారు. స్థానిక రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ బి.కుసుమ, డాక్టర్ అలెగ్జాండర్ ఆధ్వర్యంలో జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు డయేరియాపై ప్రచారం, డెంగీ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపిహెచ్‌ఈఓ ఈశ్వరయ్య, ఎన్.లలిత, ఎస్.శ్యామల, జి.వెంకటేశ్వరావు, ఎంఎల్‌పిఎస్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## డయేరియా నివారణపై అవగాహన

తొట్టంబేడు, జూలై 2 ప్రభాతవార్త :



మండలంలోని గ్రామ పంచాయతీ శ్రీరామకాలనీలో డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్, ఈఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ శంకర్‌రెడ్డి, ఎఈ మమత మరియు పంచాయతీ కార్యదర్శి అంకయ్యలు గ్రామంలో పర్యటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అందరు తాగునీటిని కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనారోగ్య పరిస్థితులు ఎదురైతేవెంటనే వైద్యాదికారుల దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. ఈసందర్భంగా గ్రామంలో త్రాగునీటి శాంపిళ్ళను సేకరించి నీటి నాణ్యతను పరిశీలించేందుకు ల్యాబ్‌కు పంపారు. అనంతరం డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బయ్య, మాజీ తంగేళ్ళపాళెం పిఎసిఎస్ ఛైర్మన్ మోహన్‌కిషోర్‌నాయుడు, తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇక విద్యుత్ బిల్లుల చెల్లింపులకు...

### ఎస్‌పిడిసిఎల్ యాప్, వెబ్‌సైట్‌లోనే



తిరుపతి, జులై 2ప్రభాతవార్త ప్రతినిధి:
ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్‌సంస్థ (ఎస్‌పిడిసిఎల్) పరిధిలోని వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఎపిఎస్‌పిడిసిఎల్ మొబైల్‌యాప్, వెబ్‌సైట్‌ద్వారానే చెల్లించాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు తెలిపారు. ఇదివరకు వినియోగదారులు తమ మొబైల్‌ఫోన్‌లోనిడిజిటల్ పేమెంట్స్ ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం వాలెట్‌ల ద్వారా చెల్లించేవారు. దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తడం, ఉన్న పరిస్థితులతో ఆర్‌బిఐ మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఎస్‌పిడిసిఎల్ యాప్, వెబ్‌సైట్‌లోగానీ, నేరుగా కార్యాలయాల్లో బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఇకపై డిజిటల్ పేమెంట్స్‌ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం లేదన్నారు. వినియగదారులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎపిఎస్‌పిడిసిఎల్.ఇన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటితో బాటు వినియోగదారులు నెట్‌బ్యాంకింగ్, క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు, వాలెట్, క్యాష్‌కార్డుల ద్వారా కూడా విద్యుత్‌బిల్లులు చెల్లించవచ్చని సిఎండి తెలిపారు.

## ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ మాధవికి రెండు ప్రత్యేక అవార్డులు

తిరుపతి హెల్త్, జూలై 2 ప్రభాతవార్త :



స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ డా. మాధవి కోయంబత్తూరు, హైదరాబాద్‌లో జూన్ 16వ తేది నుండి 30వ తేదిలలో జరిగిన కాన్ఫరెన్స్ లో రెండు ప్రత్యేక అవార్డులను అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ డా. మాధవి మాట్లాడుతూ నెహ్రూ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరఫి, కొయంబత్తూరు నుండి ఇంటర్నేషనల్, ఇంటర్ కాలేజియేట్‌లో జూన్ 16న మేరీ మెక్, మిలియన్ అవార్డును, 30 వ తేదిన ఫిజియో ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, అపోలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి హైదరాబాద్ నందు నిర్వహించిన 2వ ప్రపంచ కాంగ్రెస్ ఫిజికల్ థెరఫిలో ఫిజియో ఎక్సలెన్స్ అవార్డులను అందుకుంటున్నట్లు డా. మాధవి తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ అవార్డులను అందుకున్న డా. కె.మాధవిని మంగళవారం డైరెక్టర్ చాంబర్ నందు అభినందించారు.

## ప్రజాసేవకులు రంగినేని

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడుగా రంగినేని చెంచయ్య నాయుడు విశేష సేవలందించారని పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య అన్నారు. రంగినేని చెంచయ్య నాయుడు ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి అనుయాయుడుగా ఉంటున్నారన్నారు. ముఖ్యంగా బొజ్జల కుటుంబానికి సన్నిహితంగా ఉన్న ఆయన మన్నవరం గ్రామాభివృద్ధికి ఎంతో సేవలందించారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రంగినేని చెంచయ్యనాయుడు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని వెన్నంటి ఉంటూ విజయానికి కృషి చేసారన్నారు. అలాంటి నాయకుని జన్మదిన సందర్భంగా అభినందించటం ఆయనకు ఇచ్చే గుర్తింపుకు నిదర్శనం అన్నారు. చెంచయ్యనాయుడును తెలుగుదేశం పార్టీ తరఫున బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మండల నాయకులు సుబ్బారెడ్డి, కామేష్‌యాదవ్, రవీంద్రరెడ్డి, ఈశ్వరంరెడ్డి, పాపిరెడ్డి పలువురు సర్పంచ్‌లు పట్టణ నాయకులు సత్కరించారు.

## శివయ్య సేవలో బండారు

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంగళవారం విజయనగరం జిల్లా మాడుగుల నియోజవర్గం శాసనసభ్యుడు బండారుస త్యనారాయణ కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసిన ఎఇఓ సతీష్‌కుమార్ కుటుంబసభ్యులకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులు శివప్రసాద్‌శర్మ బృందంచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్లచిత్రపటాలను టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ అందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రదీప్, కన్నలి ప్రతాప్, సిద్దులయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులపై సమీక్ష

తిరుపతి కార్పొరేషన్, జూలై 2 ప్రభాతవార్త :



నగరంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ మంగళవారం అధికారులు, కాంట్రాక్ట్ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ఏఈకాం, కాంట్రాక్టు ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధితి సింగ్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు ఆలస్యం అవుతోందని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా అనుకున్న మేర పనుల పూర్తి చేయాలన్నారు. ఈ కేంద్రం ద్వారా నగరంలో భద్రత మరింత పెరుగుతుందని, నగరంలో సెంటర్ పనిచేస్తుందన్నారు. అలాగే వాహనాల రాకపోకల నియంత్రణ, నగరంలో కాలుష్య నియంత్రణ, యూజర్ చార్జీలు వసూళ్లు, అపరాధ రుసుము విధింపు వంటి కార్యక్రమాలు ఈ సెంటర్ ద్వారానే సాగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపాల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నడకమార్గాల్లో...భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత

### -టిటిడి ఈఓ శ్యామలరావు

తిరుమల, జులై 2ప్రభాతవార్త ప్రతినిధి:



గోవింద నామస్మరణలతో తిరుమలకు నడచివచ్చే కాలినడక మార్గాల్లో వన్యప్రాణులు, అడవి జంతువుల కదలికలపై మెరుగైన సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుచేయాలని, కదలికలను గమనిస్తూ భక్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. ప్రస్తుతం ఉన్నట్రాఫ్ కెమెరాలేగాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకునేందుకు మరిన్నిట్రాఫ్ కెమెరాలను ఏర్పాటుచేయాలన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గంలో నడకమార్గాల్లో భక్తుల భద్రతపై మంగళవారం సాయంత్రం జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, తిరుపతి జూ పార్కుక్యూరేటర్ సెల్వం, తిరుపతి డిఎఫ్ఓ సతీష్, సబ్‌డిఎఫ్ఓ శ్రీనివాస్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ2 జగదీశ్వర్‌రెడ్డి, విఎస్ఓ నందకిశోర్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పంచాయతి అధికారి మల్లికార్జున్‌తో కలిసి సమీక్షించారు. కాలిబాట భక్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ ను ఢీకొన్న ఆటో!

కోట, జూలై 2 ప్రభాతవార్త :



విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబ్ కృష్ణమూర్తిపై ఓ ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఆటో తొ ఢీకొన్న సంఘటన మంగళవారం కోటలో చోటు చేసుకుంది. వివరాల ఇలా ఉన్నాయి. స్దానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ట్రాఫిక్ డ్యూటీలో కృష్ణమూర్తి ఉన్నారు. వేగంగా వెళ్లతున్న ఆటోను నెమ్మదిగా వెళ్లామని ఆటో డ్రైవర్ వంశీని కానిస్టేబుల్ కృష్ణమూర్తి కోరారు. దీంతో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో మరింత రెచ్చిపోయి కృష్ణమూర్తి పైకి ఆటో ఎక్కించాడు. దీంతో కృష్ణమూర్తికి రక్త గాయాలు అయ్యాయి. ఆమేరకు బాధితుడు కృష్ణమూర్తి కోట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చిక్సిత పొందారు. విధి నిర్వహణలో ఉన్న తనపైకి ఆటో డ్రైవర్ దురుసుగా ప్రవర్తించారని, తనను ఉద్దేశపూర్వకంగా ఆటో తో ఢీకొన్నారని కృష్ణమూర్తి స్దానిక పోలీస్ స్టేసన్‌లో పిర్యాదులో పేర్కొన్నారు. కాగ ఇటీల కాలంలో ఆటోలు కోటలో విపరీతంగా దూసుకెళ్లతున్నాయని, ట్రాఫిక్ రూల్స్‌ను కొంత మంది డ్రైవర్లు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్డుకి అడ్డదిడ్డంగా నిలిపి వేయడం వంటి సంఘటనలతో తరుచూగా కోట, విద్యానగర్‌ల్లో ట్రాపిక్ అంతరాయం కలుగుతోందిని మండల ప్రజల ఆరోపిస్తున్నారు. కొంత మంది ఆటో డ్రైవర్లు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న సంఘటనలు కూడ లేకపోలేదు. పోలీసు ఉన్నాధికారులు ఆటో డ్రైవర్లు పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒక కానిస్టేబుల్‌పైనే దురుసగా వ్యవహరిస్తే ఇక సామాన్య ప్రజల పరిస్దితి ఏమిటిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## శ్రమిస్తేనే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, జూలై 2 ప్రభాతవార్త :



విద్యార్థులు ప్రాథమికదశ నుంచి శ్రమించి చదివితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలికల హైస్కూలులో నిర్వహించిన విద్యార్థులకు కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించి కార్పొరేట్ స్థాయి స్కూళ్లకు ధీటుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, ఇందులో భాగంగానే స్టుడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు చిన్నతనం నుంచి కష్టపడే తత్వాన్ని అలవలచు కోవాలని విజయశ్రీ సూచించారు. ప్రస్తుతం స్పీడ్ యుగం నడుస్తుందని, అందుకు తగ్గట్టుగా తమ చర్యలను విద్యార్థినులు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనోధైర్యాన్ని పెంపొందించుకొని భవిష్యత్‌లో తమకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్ చేస్తే ఆ ఆకతాయిల ఆటకట్టించేందుకు ఇప్పటి నుంచే ధైర్యాన్ని కూడగటుకోవాలని విజయశ్రీ తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉంటున్నారని, అందుకు తగ్గట్టుగా విద్యాబుద్ధులు సక్రమంగా నేర్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె విద్యార్థినులకు తెలిపారు. అలాగే బాలికల హైస్కూల్‌లో ఆడిటోరియం నిర్మాణానికి రూ.25 వేలు సీనియర్ న్యాయవాది తిరుమూరు సుధాకర్‌రెడ్డి ప్రకటించగా, బీసీ నాయకులు చిట్టేటి పెరుమాళ్లు మరో రూ.25 వేలు విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రముని, టిడిపి నేతలు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, కొక్కు శంకరయ్య, దంతాల రవి, మేడా సాయినారాయణ, నలజాం రాము, ఎంఇఓలు కె.శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, తడ, దొరవారిసత్రం మండలాల ఎంఇఓలు పాల్గొన్నారు.

## వ్యవసాయాధారిత కోర్సులతో చక్కటి ఉపాధి : కలెక్టర్

చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త :



వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సులతో చక్కటి ఉపాధి అవకాశాలున్నాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మండలంలోని కాటిపేరి పంచాయతీ అగిస్తిగానిపల్లి సమీపంలో నిర్మితమవుతున్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. యువతీ, యువకులు త్వరితగతిన ఉపాది అవకాశాలు పొందేందుకు వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సులు తోడ్పతాయన్నారు. వీటి ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలోని అధిక సంఖ్యలో విద్యార్థులకు సదవకాశమన్నారు. వ్యవసాయ, పశు ఆధారిత రంగాలపై ఆసక్తి ఉన్న వారందరూ కోర్సులు పూర్తి చేసి ఉపాధి అవకాశాలు ఏర్పరుచుకోగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. భవన నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాంసబులటీ ఫండ్ రూ. 2కోట్లతో కళాశాల నిర్మాణ పనులను ఇప్పటి వరకు 40శాతం పనులు పూర్తి చేసినట్లు ఎపిఇడబ్ల్యుఐడిసి ఈఈ శివ ప్రసాద్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వివరించారు. తహశీల్దార్ శివరాముడు, కళాశాల ప్రిన్సిపాల్ నజీరుద్దీన్, ఆర్ఐ సుధాకర్‌నాయక్, విఆర్వో వేణుగోపాల్, రెవిన్యూ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## కెఇసి లియో ఫ్యూచర్ క్లబ్‌కు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్‌చే అవార్డు

కుప్పంరూరల్, జూలై 2 ప్రభాతవార్త :




కుప్పం ఇంజపీరింగ్ కాలేజ్‌లో ఉన్న లియో ఫ్యూచర్ క్లబ్‌కు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ వారిచే ఉత్తమ లియో క్లబ్ అవార్డు వచ్చినట్లు బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్ తెలిపారు. కళాశాల ఇసిఇ విభాగానికి చెందిన వరుణ్‌కుమార్ ఉత్తమ లియో క్లబ్ ప్రెసిడెంట్ అవార్డును లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ కృష్ణారెడ్డి, డిస్ట్రిక్ గవర్నర్ లయన్ రామరాజ్, జోనల్ ఛైర్మన్ డా॥ మహేష్‌ల చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. తమ విద్యార్థులు చేస్తున్న సామాజిక సేవలకు తగు గుర్తింపు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మాధవన్, గంగాధర ం, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, హెచ్ఒడిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ అధితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, జూలై 2 ప్రభాతవార్త :



తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను నిర్వహణ చేసేందుకు తూకివాదం వద్ద నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన చెత్త నిర్వహణ కేంద్రాన్ని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ మంగళవారం పరిశీలించారు. నగరంలో సేకరించిన చెత్తను తూకివాకం వద్ద గల చెత్త నిర్వహణ కేంద్రానికి వేర్వేరుగా తరలిస్తారు. నగరం నుండి సేకరించి తడి చెత్త (ప్లాస్టిక్) ద్వారా ఎరువు, పొడి చెత్త ద్వారా వచ్చిన వ్యర్థాలను సిమెంట్ ఫాక్టరీలకు తరలిస్తారని మార్కెట్, కూరగాయల వ్యర్థాల నుండి గ్యాస్ ఉత్పత్తి చేసే విదానాన్ని ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కి వివరించారు. అలాగే మురుగునీటి నిర్వహణ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. అన్ని ప్లాంట్లు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంట్‌ను మరింత శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే మురుగునీటి నిర్వహణ గుంతల వద్ద ఉన్న చెట్లు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అంతకముందు నగరంలో బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వాహణ పనులను, త్రాగునీరు, మురుగునీటి కాలువలను పరిశీలించారు. రానున్నది వర్షాకాలం అని, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కమిషనర్ వెంట ఉప కమిషనర్ అమరయ్య, మున్సిపాల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డిఈ విజయ కుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య,